## 5వ అధ్యాయము

# సంఘ అభివృద్ధి

నీవు ఒక పాస్టరువు మరియు నీవు నీ సంఘం పెరగాలని అభివృద్ధిచెందాలని కోరు కొనుచున్నావు. పాస్టర్స్ ఇలా కోరుకోవటం సహజమే. కాని ఎందుకు నీ సంఘం ఎదగాలని నీవు కోరుకొనుచున్నావు. ***ఇలా కోరుకొనడానికి నిజంగా నీ హృదయములో ఉన్న కారణము ఏమిటి***?

నీలో నీవు విజయుభావన కలిగి ఉండుటకొరకు నీవు నీ సంఘము అభివృద్ధిచెందాలని కోరుకొనుచున్నావా? నీవు గౌరవించబడి ఒక పలుకుబడిగల వ్యక్తిగా ఉండాలనా? నీవు ప్రజల మీద అధికారం చూపించాలనా? నీవు ధనం సంపాదించాలనా? నీ సంఘం అభివృద్ధిచెందాలని ఈ వీటిని కోరుకుంటున్నట్లయితే అవి సరియైన కారణాలు కాదు.

నీ సంఘ అభివృద్ధి ద్వార దేవుడు మహిమపరచబడి అనేక మంది పరిశుద్ధాత్మద్వార మార్చబడుతారు అన్న ఉద్దేశ్యము నీకున్నట్లయితే అది సరియైన కారణము.

మన ఉద్దేశ్యాలు స్వార్థముతో కూడిన వయ్యుండగా అవి మంచివేనని తలస్తున్నట్లయితే మనలను మనమే మోసం చేసుకుంటున్నాము.

ఏవిధంగా మన నిజమైన ఉద్దేశ్యాలను తెలుసుకోవచ్చు. మనం **స్వంత** రాజ్యాన్ని స్థాపించుచున్నామా లేదా దేవుని రాజ్యాన్ని స్థాపించు చున్నామా అని మనం ఎలా తెలుసుకోగలం?

ఇతర పాస్టర్ల యొక్క విజయంపట్ల మన అంతరంగిక ఆలోచనలను ఏవిధంగా ఉన్నాయన్నది గమనించుట ఒక విధము. మన ఉద్దేశ్యాలు సరియైనవని అనుకున్నచో, దేవుని రాజ్య మరియు సంఘ వ్యాప్తి కొరకు పని చేయాలి అనుకొంటూ మరొక సంఘ అభివృద్ధి గురించి విన్నప్పుడు మనలో అసూయ ద్వేషము ఉంటే మన ఉద్దేశ్యాలు సరియైనవి కావు. నిజంగా మనం సంఘ అభివృద్ధిని కాదు కాని మన స్వంత సంఘాభివృద్ధిని అభిలషిస్తున్నట్లు అర్థమవుతుంది. ఎందుకంటే మన ఉద్దేశ్యాలు స్వార్థము కలిగినవి కాబట్టి మన స్వంత ప్రాంతములో కొత్త సంఘ ప్రారంభమవబోతుందని మనం విన్నప్పుడు మన అంతరంగిక ఆలోచనలను గమనించుట ద్వారా కూడ మన ఉద్దేశ్యాలు సరియైనవా కాదా అని తెలుసుకోవచ్చు. దీనిని బట్టి తెలుస్తున్నది ఏమిటంటే మన ఆసక్తి అంతా **మన** సొంత అభివృద్ధికోసమే కాని దేవుని రాజ్యంకొరకు కాదని అర్థమైపోతున్నది.

ఇదే విధంగా పెద్ద మరియు పెరుగుచున్న సంఘ పాస్టరులు కూడ తమ ఉద్దేశ్యాలను పరీక్షించుకోవచ్చు. అభివృద్ధిచెందుచున్న సంఘ ముఖ్య నాయకులను మరియు సంఘస్తులను ఇచ్చి వేరొక క్రొత్త సంఘాన్ని స్థాపించంచగలనా? ఇట్లు చేయుట ద్వార నా సంఘము చిన్నదవుతుందేమో? ఇలాంటి ప్రశ్నలు వేసుకొని తమ ఉద్దేశ్యాలను పరీక్షించుకోవచ్చును. ఏ

పాస్టరు అయితే అటువంటి ఉద్దేశ్యాన్ని అడ్డుకుంటున్నాడో అతను తన స్వంత ఘనతకొరకే సంఘాన్ని నిర్మిస్తున్నాడు. (ఇలా ఉండగా పెద్ద సంఘాల పాస్టరులు తమ గొప్పలు చాటుకోవటానికి తమ స్వంత ఘనతకొరకే చిన్న చిన్న సంఘాలను కట్టుతూవుంటారు). ఈ పాస్టరులు తమకు తాము వేసుకోవలసిన మరో ప్రశ్న, "నేను ఈ చిన్ని సంఘాల పాస్టరులతో సన్నిహితంగా ఉంటున్నానా, లేక వారి మీద అధికారిననే భావంతో వారిని దూరంలో ఉంచుతున్నానా?" లేక "పన్నెండు లేక ఇరవై మంది సభ్యులుగల ఓ చిన్ని గృహ సంఘానికి పాస్టరుగా ఉండుటకు నేను సముఖత చూపిస్తున్నానా, లేక అది నా అహాన్ని దెబ్బతీస్తుందా?"[23]

## సంఘాభివృద్ధి ఉద్యమం

అమెరికా మరియు కెనడ దేశాలలోని క్రైస్తవ పుస్తకశాలలో సంఘాభివృద్ధికొరకై ప్రత్యేకించబడిన విభాగాలు కనిపిస్తుంటాయి. ఈ పుస్తకాలు మరియు వాటిలో ఉన్న విషయాలు ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తిచెందాయి. పాస్టర్లు వారి సంఘ సభ్యుల పెరుగుదల పట్ల ఆత్రుత కలిగి అమెరికా దేశాలలోని అభివృద్ధి చెందిన పెద్ద భవనాలు కలిగి ఎక్కువ సభ్యత్వం కలిగిన పాస్టరుల యొక్క సలహాలను ఆచరించటానికి త్వరపడుతూ ఉన్నారు.

ఉత్తమ శ్రేణి శిష్యులను తీర్చిదిద్దుటలో చర్చి భనన పరిమాణం మరియు సభ్యుల సంఖ్య కొలబద్ధ కాదని వివేచన కలిగినవారు గుర్తిస్తారు. బైబిలు సత్యాలను మార్చి ప్రజలకు అనుకూలంగా బోధించుటను బట్టి, అమెరికాలో కొన్ని సంఘాలు అలా అభివృద్ధి చెందాయి. ఒకసారి ఒక వ్యక్తి రక్షణపొందిన తరువాత అతను ఏవిధంగా జీవించినప్పటికీ మరియు దేనిని నమ్మినప్పటికీ వారి రక్షణను వారు కోల్పోరని అమెరికా దేశములోని అనేకమంది పాస్టరులు నమ్ముతూ దానిని ప్రజలకు బోధిస్తూవున్నారన్న సంగతి విని ప్రపంచంలో నాకు పరిచయమున్న ఇతర పాస్టరులందరూ షాక్ అయ్యారు. ఇదేవిధంగా అనేకమంది అమెరికా దేశపు పాస్టరులు సువార్తను మరియు దేవుని కృపను గూర్చి సరిగా బోధించక, పరిశుద్ధతలేకున్నను పరలోకం వెళ్ళచ్చు అనే భావనను ప్రజలలో కల్పించి తప్పు దోవ పట్టిస్తున్నారు. అభివృద్ధి సువార్తను అనేక మంది బోధిస్తున్నారు. దీని ద్వారా భూలోకములో ఆస్థులను కూర్చుకొనుటకు ఈ మతము ఒక మార్గము అనే భావనను మనుష్యులలో పెంపొందింప చేయుచున్నారు. ఈ పాస్టరుల యొక్క సంఘాభివృద్ధి సూత్రాలను మనము అను సరించకూడదు.

నేను సంఘాభివృద్ధి అను అంశముపై అనేక పుస్తకములను చదవటం మూలాన దాని గురించి భిన్నాభిప్రాయాలను కలిగివున్నాను. వాటిలోని సలహాలు , పథకాలు కొంతవరకు బైబిలు పరంగావుండటం చేత వాటిని చదవటానికి యోగ్యమైనవిగా భావించాను. కాని అవన్నీ 1700 సంవత్సరాల పాత సంఘసంస్థల పద్ధతుల మీద కట్టబడినవిగానే ఉన్నాయి కాని,

---

[23] గృహ సంఘం వలన కలిగెడు మరియొక ప్రయోజనం ఇక్కడ ఇస్తున్నాను: పాస్టరులు తమ తప్పుడు కారణాలచేత పెద్ద సంఘం కోసం ప్రయత్నించ వలసిన అవసరం లేదు ఎందుకంటే సంఘం యొక్క పరిమాణం ఆ గృహ పరిమాణం మీద ఆధారపడి ఉంటుంది కనుక.

బైబిలును ఆధారం చేసుకొని వ్రాయబడిన పథకాలు కానేకావు. ఫలితంగా శిష్యులను, శిష్యులను తయారు చేయువారిని తర్ఫీదు చేయకుండా స్వంత వ్యక్తిగత సంఘాలు నిర్మించుటలో దేవుని సేవకులు తలమునకలైవున్నారు, మరియు పెద్ద పెద్ద భవన నిర్మాణములు, ప్రత్యేక కార్యక్రమాలు, వాటిని నిర్వహించుటకు ప్రత్యేక సిబ్బందిని నియామకం చేయటం ఇవన్నీ చూస్తే ఇదేదో ఒక వ్యాపార సంస్థ (కార్పోరేషన్) లాగా కనబడుతున్నాదే కాని క్రీస్తునందు ఉన్న ఓ కుటుంబములాగా కనిపించటంలేదు.

యేసు ప్రభువుని అనుసరించని ప్రజలను ఆకర్షించుటకు ఆరాధన కార్యక్రమమును ఆకర్షవంతంగా మార్చాలని కొన్ని ఆధునిక సంఘాభివృద్ధి ప్రణాళికలు సూచిస్తున్నాయి. క్లుప్తమైన మరియు విమర్శకు తావులేని ప్రసంగాలను, భావావేశం లేని ఆరాధనలు చేయాలని, అనేక సాంఘీక సేవాకార్యక్రమాలను చేపట్టాలని, డబ్బు ప్రసక్తి తీసుకురాకూడదని....ఇలా ఎన్నెన్నో పద్ధతులను ఆధునిక విధానాలు సూచిస్తున్నాయి. ఈ పద్దతులు తమను తాము ఉపేక్షించుకొని, క్రీస్తు ఆజ్ఞలను అనుసరించు శిష్యులను తయారు చేయలేవు. కాని లోకస్తులతో సమానమై పాతాళ ద్వారపు మార్గములో పయనించునట్లు చేస్తాయి. ఇది సాతాను సంఘమును జయించుటకు ఏర్పరచుకున్న పథకమేగాని, లోకాన్ని జయించుటకు దేవుడు ఎన్నుకొన్న మార్గముకాదు. ఇది "లోకసంబంధమైన అభివృద్దే కాని" సంఘ అభివృద్ధి ఏమాత్రము కాదు.

## అన్వేషికి అనుకూలమైన పద్ధతి

పేరొందిన అమెరికా దేశపు వ్యూహాత్మకమైన సంఘ అభివృద్ధి విధానము "అన్వేషి యొక్క సున్నితమైన పద్దతి" అని పిలువబడుతుంది. ఈ వ్యూహరచన ఆదివారపు ఆరాధనను రెండు విషయాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించినది 1. క్రైస్తవులు తమ రక్షణ పొందని స్నేహితులను ఆహ్వానించటంలో అనుకూలంగా ఉండునట్లు 2. రక్షణపొందని వారికి ఇబ్బంది కలిగించని వారి కనుకూలమైన సువార్తను ప్రకటించునట్లుగా రూపొందించబడినది. విశ్వాసులను శిష్యరికములోనికి నడిపించుటకు మద్యవారపు మరియు చిన్న గుంపుల ఆరాధనలు రూపొందించ బడినట్లుగా ఈ వ్యూహము తెలియచేస్తుంది.

ఈ విధానము ద్వారా కొన్ని సంఘాలు చాలా పెద్దవిగా అభివృద్ధి చెందాయి. సంఘమును చిన్న విభాగములుగా చేసి, సుశిక్షతులైన శిష్యులను చేయుటకు, సువార్త ప్రకటించుటకు ఈ సంఘాలకు సంస్థలతో ముడిపడివున్న సంఘాలకన్నా ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరు ఈ చిన్న సంఘాలలో చేరి శిష్యులుగా శిక్షణ పొందుతున్నంతవరకు మరియు సువార్త విషయంలో రాజీ పడనంతవరకు (ఒకరికి కోపం తెప్పించకూడదు అన్న ధ్యాస ఉన్నంతవరకు ఈ రాజీ పడటం జరుగుతూ ఉంటుంది, ఎందుకంటే నిజమైన సువార్త ఎదుటివ్యక్తికి కోపం కలిగిస్తుంది) ఈ సంఘాలు ఎంతో శక్తి వంతంగా పనిచేస్తుంటాయి. రక్షణ పొందని వారికి సువార్త ప్రకటించుటకొరకు ఈ సంఘాలు సంస్థాపరమైన సంఘాలు పాటించలేని వ్యూహాలను ఎన్నుకొన్నాయి.

కాని సంఘ అభివృద్ధికొరకు అమెరికా దేశపు అన్వేషి యొక్క సున్నితమైన పద్ధతిని,

బైబిల్ పద్ధతితో ఏవిధంగా పోల్చవచ్చును?

అపోస్తుల కార్యముల గ్రంథములో అపొస్తలులు మరియు సువార్తికులు బహిరంగంగా మరియు ఇంటింటా అద్భుతములతోకూడిన సువార్తను బోధించారు. దీనిని బట్టి అనేక మంది అవిశ్వాసులను అకర్షించారు. మారుమనస్సు పొంది ప్రభువును అంగీకరించిన వారు అపొస్తలుల బోధను అనుసరించి సంఘ పెద్దల, పాస్టర్ల, నాయకత్వములో క్రమముగా సహవాసము చేయుచు దేవుని వాక్యమును నేర్చుకొనుచు, ఆత్మ వరములను ఉపయోగించుచూ, ప్రభురాత్రి భోజనమును పాటించుచూ, కలసి ప్రార్ధిస్తూ వచ్చారు. ప్రవక్తలను మరియు బోధకులను సంఘాలను బలపరచుటకు దేవుడు పిలిచాడు. ప్రతి ఒక్కరు సువార్తను స్నేహితులతోను మరియు పొరుగు వారితోను పంచు కున్నారు. దేవుని సువార్తను వ్యాప్తిచేసి, శిష్యులను చేయుటకు ఉన్న వనరులను దారి మళ్ళించి సంఘ ఎదుగుదలను ఆపునట్లు చేయు పెద్ద పెద్ద చర్చి భవనాలు ఆరోజులలో లేవు. నాయకులు తాము చేయవలసిన పని మీద త్వరగా తర్ఫీదు పొందారు, కాని వాళ్ళు బైబిలు పాఠశాలలకు సెమినరీలకు పంపబడలేదు. ఇవన్నీ తగిన సమయంలో సంఘము యొక్క త్వరిత అభివృద్ధికి మరియు ఆ ప్రాంతములో ఉన్న ప్రజలందరికీ సువార్త అందించడానికి తోడ్పడ్డాయి.

పోల్చిచూస్తే, అన్వేషికి అనుకూలమైన పద్ధతి అనే ఈ విధానము సూచనలు మహత్కార్యాలు అంటూ ఏమీలేని ఒక నిరర్ధకమైనది, అనగా ఇందులో దైవికమైన ప్రకటనలు, ఆకర్షణలు, ఒప్పుదల అనునవి ఉండవు. ఇది ప్రజలు తమ మందిరమునకు వచ్చి తాము చెప్పే సందేశం వినుటకు వారిని ఆకర్శించే ఉద్దేశ్యంతో సాధారణ వ్యాపార సంబంధమైన ప్రకటనలు మరియు వ్యాపార సాధనాల మీదే ఎక్కువగా ఆధారపడుతుంది. ప్రసంగీకుని యొక్క మాట్లాడే నేర్పు, తన ఒప్పింపగల సమర్థత అనునవి ఎవరినైన అంగీకరింపజేయుటకు కావలసిన ప్రాథమిక కారకాలై యున్నవి. కాని ఇది పౌలు భక్తుడు చేసిన బోధలకు భిన్నంగా ఉంటుంది. 1కొరింథీ 2:4-5లో పౌలు ఈ విధంగా తెలియజేశాడు:

"మీ విశ్వాసము మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక దేవుని శక్తిని ఆధారము చేసికొని యుండువలెనని, నేను మాటలాడినను, సువార్త ప్రకటించినను, జ్ఞానయుక్తమైన తియ్యటి మాటలను వినియోగింపక, పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు జీవిస్తూ, కనపరచు దృష్టాంతములనే వినియోగించితిని." (1కొరింథీ 2:4-5)

## ఎక్కువ వ్యత్యాసము

ఈ పద్ధతి పాస్టర్స్‌కు ఎక్కువ ఉపయోగ పడుతుంది. దీనినిబట్టి ఉదయించే ప్రశ్న ఏమంటే అపోస్తలులకు మరియు సువార్తికులకు లేని పరిచర్య పాస్టర్‌కు అప్పగించబడుటను బట్టి సంఘం అభివృద్ధి చెందుటకు మంచి అవకాశాలు ఉంటాయా? [24]

---

[24]ఈ రోజుల్లో సంఘాలను నడుపుటకు సువార్తికులు, బోధకులు, ప్రవక్తలు మరియు అపొస్తలు వీరందరు మనకు ఎందుకు కావలసి ఉన్నది అనుటకు చాలా కారణం ఉంది. చాలామంది దేవుని పిలుపు (తరువాయి భాగం పక్కపేజీ లో చూడుము)

ఈ పద్ధతిలో పాస్టరుగారు ఒక ఆదివారం ప్రార్థనకూటమునకు అన్యులను సంఘానికి తేబడునట్లు విశ్వాసులను ప్రోత్సహిస్తాడు. దీనిని బట్టి చూస్తే సువార్తను వినగలిగే అవకాశం అన్యులకు వారానికి ఒక్కసారి మాత్రమే లభిస్తుంది. ఇందులో క్లిష్టమైన విషయం ఆ అన్యులు చర్చికి రావటానికి సుముఖతను చూపించాలి, విశ్వాసులు వారిని ఆరాధనకు ఆహ్వానించాలి, తర్వాతనే సువార్త వినే అవకాశం అన్యులకి కలుగుతుంది. కాని బైబిలు విధానములో సువార్తికులు, అపోస్తలులు మరియు విశ్వాసులు సువార్తను బహిరంగంగా మరియు వారి మందిరములలో ప్రకటించాలి, మరియు విశ్వాసులందరూ సువార్తను తమ స్నేహితులతోను, పొరుగువారితోను నిరంతరమూ పంచుకోవాలి. ఈ రెండు పద్ధతులలో సువార్త వినే అవకాశం అన్యులకు ఏ పద్ధతి ద్వార లభిస్తుంది?

మొదటిపద్ధతిలో ఒక భవనం కావాలి, ఆ భవనంలోనికి అన్యులను ఆహ్వానించడానికి విశ్వాసులు ఇష్టపడాలి మరియు అన్యులకు అది ఇబ్బందికరం లేనిదిగా ఉండేలా చూడాలి. ఇలా జరగాలంటే తగినంత ధనం అవసరమవుతుంది. సువార్త ప్రకటించబడుటకు ముందే ఆ భవన నిర్మాణము జరగాలి. అమెరికా దేశాల్లో అయితే ఆ భవనం ఊరికి వెలుపల ధనికులు నివసించే ఒక అనువైన ప్రాంతంలో కట్టబడాలి. కాని బైబిలు పద్ధతి ప్రకారం సువార్త ప్రకటించబడుటకు ఏవిధమైన భవనం, ధనం లేదా అనువైన ప్రదేశం లాటివి అవసరంలేదు. సువార్తబోధ ఆదివారంనాడు ఓ ప్రత్యేకమైన భవనంలో కూడుకున్న ప్రజలకు మాత్రమే పరిమితమవదు.

## మరికొన్ని వ్యత్యాసాలు

ఈ అన్వేషికి అనుకూలమైన పద్ధతికి మరియు బైబిలు ఆధారిత పద్ధతుల మధ్య మరికొన్ని తేడాలు మనం గమనించవచ్చును.

అపొస్తలుల కార్యముల గ్రంథములో సువార్తికులు మరియు అపొస్తలులు, మారుమనస్సు, క్రీస్తునందు విశ్వాసమును మరియు బాప్తిస్మమును గూర్చి బోధించేవారు. లూకా సువార్తలో **14:26-33**, యోహాను **8:31-32**లో చెప్పబడినట్లు మారుమనస్సు పొందుటతో పాటు క్రీస్తు శిష్యులుగా మారి, యేసు ప్రభువు శిష్యత్వం నిమిత్తమై ఇచ్చిన సూత్రాలను పాటించు వారిగా ఉండాలి. వాళ్ళు యేసుని ప్రేమించుతూ వాక్య ప్రకారం జీవిస్తూ, సిలువనెత్తుకొని

---

నందుకున్న దైవసేవకు ఈ వ్యవస్థాపరమైన సంఘంలో సరైన స్థానం ఇవ్వబడలేదు, కావున ఈ పాస్టరు స్థానంలో లేని దైవసేవకులు సంఘాలను నడుపుటను మానుకొని బైబిలు పరమైన సంఘములోని విశ్వాసులకు తాము ఆశీర్వాదకరముగా ఉండకుండా సంఘాన్ని దొంగిలిస్తున్నారు. కనుక ప్రతి ఒక్కరు తమ పిలుపు ప్రకారం నడుచుకొనక సంస్థాపరమైన సంఘ విధానాలను, కట్టడలను అనుసరిస్తూ తమ సొంత సంఘాన్ని తిరిగి యధాస్థితికి తీసుకొని వస్తున్నట్లుగా అగుపడుతోంది. పాస్టరులు "తమ సంఘస్థులు" ఇచ్చే దశమ భాగాన్ని పొందుటకు అర్హులు కావటం చేత, అందులోని అధిక భాగం భవన నిర్మాణానికి, ఇతర భవనాల నిర్వహణకు ఖర్చు చేయబడుతున్నది, ఈ పాస్టరు స్థానంలో లేని దైవసేవకులు తాము ఏ పరచర్యకైతే పిలవబడ్డామో ఆ పరిచర్య కొరకు ఆర్థికపరమైన సహాయం పొందుటకు ఈ సంఘాలను నడిపిస్తుంటారు.

ఆస్థుల హక్కులను వదలుకొని ఒక నూతనమైన పరిచారకులుగా జీవించాలని వారి బోధయొక్క సారాంశం.

ఈ రెండు పద్ధతుల మధ్య సువార్త బోధింపబడు విధానంలో కూడ వ్యత్యాసం కనిపిస్తుంది. యేసు పాపిని ఎంతగా ప్రేమిస్తున్నాడు, మనుష్యుల అవసరాలు ఆయన ఎలా తీరుస్తాడు, యేసును అంగీకరించుట ద్వార ఎలా రక్షింపబడుతారు అనే విషయాలు ఈ మొదటిపద్ధతిలో బోధించ బడుతాయి. తర్వాత రక్షణ నిమిత్తమైన చిన్న ప్రార్థన చేస్తారు. కాని శిష్యరికం గురించి బోధ చెయ్యరు. వారు రక్షణపొందారని అప్పుడప్పుడు భ్రమింపజేస్తు ఇకపై క్రీస్తునందు ఆత్మీయంగా ఎదుగుటకు అవసరమగు శిక్షణా తరగతిలో చేరమని వారిని అడుగుతుంటారు. వారు ఒకవేళ అటువంటి తరగతుల్లో చేరాక వారికి తమ సంఘ సిద్ధాంతముల గురించి ఎక్కువ పరిజ్ఞానం పొందాలన్న దాని మీదే దృష్టి యుంచి దానికి తగిన పాఠాలే నేర్పుతారు తప్ప, క్రీస్తు ఆజ్ఞలకు విధేయత చూపాలి అన్న పాఠాలు నేర్పరు. ఎప్పుడైతే విశ్వాసి **తుదకు** తన దశమభాగం సంఘానికి ఇవ్వటం ఆరంభించి(అనగా భవన నిర్మాణం కోసం తీసుకున్న అప్పును చెల్లించుటకు, బైబిలుకు సంబంధంలేని సిబ్బందికి జీతాలు ఇచ్చుటకు, దేనికైతే సహకరించవలెనని దేవుడు కోరుకుంటున్నాడో దానిని లక్ష్యపెట్టక ఆయన నిర్దేశించనిదానికి సహకరిస్తూవుండటానికి ఈ దశమభాగం ఉపయోగపడుతుంది) తద్వార సంస్థాపరమైన సంఘంలోని కార్యక్రమాలలో సహకరించుటకు తన వంతు పాత్రవహించానని అదియే "తన పరిచర్యగా" భావించేలా నడిపించబడతాడు, ఇటువంటి సంఘంలో ఇదియే శిష్యరికపు పరాకాష్ట.

ఒకవేళ సైన్యానికి తగినంత మంది అభ్యర్థులు దొరకనప్పుడు వివిధ ఆకర్షణలద్వార అందరినీ సైన్యంలో చేర్చాలని నిర్ణయం తీసుకుంటే ఏమవుతుంది? వారు గనుక సైన్యంలో చేరితే వారికి మంచి పదవులు ఇస్తామని వారినుంచి ఏమి ఆశించమని అనగా వారికి అర్హతలేక పోయిననూ జీతం ఉచితమని, పెందలకడనే లేవనఖరలేదని, వారికిష్టమైతేనే వ్యాయామం చేయవచ్చని దానికి బదులుగా టి.వి చూస్తూ వుండవచ్చని వారికి వాగ్దానం చేసినట్లుగా ఊహించుకోండి. ఒకవేళ యుద్ధం వచ్చినచో వారు యుద్ధంలో పాల్గొనాలో లేక సముద్రపు ఒడ్డున కాలక్షేపంచేయాలో అన్నది వారి ఇష్టానికే వదిలేస్తున్నాం అని ప్రకటిస్తే దాని పర్యవసానం ఏవిధంగా ఉంటుంది? ఒక సారి ఊహించుకోండి.

అలా ప్రకటించినచో సైన్యం తప్పక విస్తరిస్తుంది. అందులో సందేహమేలేదు!! కాని అది నిజమైన సైన్యం అనిపించుకోదు. దాని లక్ష్యాన్ని ఛేదించటంలో అది విఫలమౌతుంది. అన్వేషికి అనుకూలమైన సంఘంలో జరిగేది ఇదే. ఆదివారపు ఆరాధనలో పాల్గొనే వారి సంఖ్య పెరుగుదల కోసం ప్రమాణాల స్థాయిని తగ్గిస్తూ, తద్వార శిష్యరికమునకు మరియు విధేయతకు నాశనం వాటిల్లచేస్తున్నారు. ఆకర్షించే సంఘాలు ఆదివారము మాత్రమే సువార్త ప్రకటించి, వారం మధ్యలో జరిగే కూడికలో శిష్యత్వం గురించి నేర్పిస్తూ కేవలం యేసు శిష్యులు మాత్రమే పరలోకం వెళతారు అని బోధిస్తున్నట్లయితే వారు సమస్యను ఎదుర్కోవలసివస్తుంది. అప్పుడు

ఆదివారం ఆరాధనకు హాజరయ్యే ప్రజలు తమకు అబద్ధం చెబుతున్నట్లుగా భావించవచ్చు. ఇలాటి సంఘాలు వారం మధ్యలో జరిగే కూడికలో ప్రజలకు శిష్యరికం మరియు విధేయతలు పరలోకం చేరటానికి కావలసిన అర్హతలు కాదుకాని అవి మన ఇష్టం మీద ఆధారపడివుంటాయి అని బోధిస్తూ వారిని మోసం చేస్తున్నారు.[25]

ఇతరులు అనుసరించని పద్ధతులను కొన్ని సంస్థాపరమైన సంఘాలు అనుసరిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ బైబిలు ఆధారిత విధానం శిష్యులను మరియు శిష్యులను తయారుచేయు వారిని ఉత్పత్తి చేయుటలో అత్యంత ఉపయోగకరమైనదిగా ఉంటుంది.

కాని నేడు ఎందుకు చాలా మంది ఈ పద్ధతిని అనుసరించటంలేదు? దీనికి జవాబు అవిశ్వాసం, అవిధేయత మరియు మన సాంప్రదాయాలేనని అర్థమవుతుంది. చాలా మంది బైబిలు పద్ధతులు ఈ కాలానికి చెల్లవని ఆలోచిస్తుంటారు. అయినప్పటికీ ప్రపంచంలో అనేక చోట్ల ఈ పద్ధతిని అవలంభిస్తున్నారు. ఈ పద్ధతిని అనుసరించుటనుబట్టి గత **50** సం॥ చైనాలో ఎంతో సంఘాభివృద్ధి చెందినట్లుగా చూస్తున్నాము. చైనాలో దేవుడు ఇతర చోట్లవుండటంకన్న వ్యత్యాసంగా ఉంటాడా? కేవలం వారు బైబిలు పద్ధతులను అనుసరించటం బట్టి అంతగా అభివృద్ధి చెందారు.

వీటన్నిటిని బట్టి అమెరికా దేశం నుండి సంఘ అభివృద్ధి కొరకు దిగుమతి చేసుకున్న పద్ధతులను బట్టి ఇతర సేవకులు జాగ్రత్త వహించాలి. బైబిలు పద్ధతులు పాటించినట్లయితే శిష్యులను తయారుచేయట అనెడి క్రీస్తు లక్ష్యాన్ని నెరవేర్చటంలో ఎంతో విజయం సాధిస్తారు.

## ఫలితముగా...

ఈ రోజులలో సంఘ అభివృద్ధి నిమిత్తం ఆధునిక సంఘం అనుసరించుచున్న పద్ధతులు సామాన్యమైన పాస్టరుకు అందుబాటులో లేవు. అనేక సంఘాలలో విశ్వాసులు వందమంది కంటే ఎక్కువ ఉండరు. అనేక సార్లు సంఘ అభివృద్ధికొరకు ఈ పాస్టరులు కొన్ని పద్ధతులను పాటించినప్పటికీ అవి పనిచేయక లేదా వాళ్ళ తప్పేం లేకుండానే అవి వైఫల్యం చెందటం ద్వారా ఎంతో కలత చెందుతుంటారు. పాస్టరు పరిధిలో లేని అనేక విషయాలు సంఘ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయన్న సంగతి ఎవ్వరు గుర్తించరు. వాటిలో కొన్నిటిని పరిశీలిద్దాం.

మొట్టమొదటిగా ***సంఘ అభివృద్ధి ఆ ప్రాంతంలో ఉన్న జనాభా మీద ఆధారపడి ఉంటుంది.*** సహజంగా పెద్ద పెద్ద సంస్థాపరమైన సంఘాలు అభివృద్ధి చెందిన పట్టణాలలో ఉంటాయి. ఆ పట్టణాల్లో కొన్ని లక్షలమంది జనాభా ఉంటారు. సంఘం నిజతత్వాన్ని

[25] లూకా 14:26-23లో యేసు తన శిష్యులుగా ఉండుటకు తగిన లక్షణాల గురించి చెప్పటం గుర్తుచేసుకుందాం. అవి ఇదివరకే విశ్వాసులుగా మారిన ప్రజల కొరకు చెప్పబడినవి కావు, అనగా వారి ఆత్మీయ ప్రయాణంలో వారు తీసుకోవలసిన రెండవ మెట్టును యేసు అనుగ్రహిస్తున్నట్లుగా ఈ మాటలు చెప్పబడలేదు. కాని ఆయన అనేక జనసమూహమును ఉద్దేశించి చెప్పాడు. ఆయన శిష్యుడిగా మారటం మాత్రమే ఆయన ఇవ్వచూపే తొలిమెట్టు. రక్షణమెట్టునకు ఇది ఏ మాత్రం తక్కువకాదు. అన్వేషిని ఆకర్షించే సంఘాలలో చెప్పబడే బోధకు ఇది వ్యతిరేకముగా ఉండును.

తెలుసుకొనుటకు సంఘం యొక్క సంఖ్యను బట్టి కాకుండ ఆ ప్రాంతంలో ఉన్నటువంటి జనాభాను బట్టి అంచనా వేయవలసి ఉంటుంది. దీనినిబట్టి ఆలోచిస్తే పది మంది విశ్వాసులు ఉన్న సంఘాలు పదివేలమంది ఉన్నవాటికంటే విజయవంతముగా ఉంటాయి. 50మంది ఉన్న గ్రామంలోని 10మంది విశ్వాసులుగల సంఘం 5లక్షల ప్రజలుగల పట్టణములోని 10 వేలమంది విశ్వాసులుగల సంఘంకన్నా గొప్పది. (అయినను ఆ పదిమంది సభ్యులుగల సంఘ పాస్టరులకు, సంఘాభివృద్ధి అన్న అంశం మీద జరిగే పెద్దపెద్ద సభలలో మాట్లాడే అవకాశం రాదు).

## సంఘాభివృద్ధిని నియంత్రించే రెండవ కారణం

***ఒక ప్రాంతంలోని ప్రజలలో సువార్త ఎంతవరకు అక్కడి సంఘాల ద్వార నింపబడింది అన్న దాని చేత సంఘాభివృద్ధి నియంత్రించబడుతుంది***. ఏ సమయంలోనైన ఒక ప్రాంతంలో కొద్ది మంది హృదయాలు సువార్త తట్టు త్రిప్పబడివుంటాయి. ఆ విధంగా సువార్తను అంగీకరించువారి శాతము అయిపోయిన తరువాత ఇంకా సంఘం అభివృద్ధి చెందే అవకాశాలు ఉండవు.

ప్రతి క్రైస్తవుడు ఒకప్పుడు సువార్తను అంగీకరించని వాడుగ ఉండేవాడు. కాని పరిశుద్ధాత్మ ప్రభావం వలన వారు సువార్తను అంగీకరించటం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు సువార్తను అంగీకరించని వారు తరువాత అంగీకరించవచ్చు. అప్పుడు సంఘం అభివృద్ధి చెందుతుంది. దీనిని మనం ఉజ్జీవము అని పిలుస్తాము. ఒకవ్యక్తి మారిన అదికూడా ఉజ్జీవం అని చెప్పవచ్చు. ప్రతి గొప్పకార్యం చిన్నగా ప్రారంభమౌతుంది. అది ఎంత ఉజ్జీవమైన మొదట అది కొద్దిమంది వ్యక్తులతో ప్రారంభమౌతుంది. కనుక తక్కువ సంఖ్యతో ప్రారంభయ్యే ఉజ్జీవాన్ని పాస్టరు అలక్ష్యంచేయకూడదు.

లూకా 9:5 ప్రకారం యేసుప్రభు తన శిష్యులను మారుమనస్సు పొందనొల్లని ప్రజల యొద్దకు మరియు పట్టణాలకు పంపించాడు. వారు సువార్త అంగీకరించరని తెలిసినప్పటికీ వారు అక్కడికి పంపించబడ్డారు. వారు వెళ్ళిన ప్రదేశాలలో ఎవ్వరూ మార్పు చెందనప్పటికీ లేదా సంఘ అభివృద్ధి లేకున్నను శిష్యులు యేసు మాటకు విధేయులవటం చేత వారి పరిచర్య విజయవంతం కాగలిగింది.

ఇదేవిధంగా ఈ కాలంలో కూడా యేసుప్రభువు, సువార్తను అంగీకరించని గ్రామాలకు, పట్టణాలకు ప్రజలవద్దకు పాస్టరులను పంపిస్తున్నాడు. ఆ పాస్టరులు తమకివ్వబడిన చిన్న సంఘంలోనే ఎంతో నిజాయితిగా సేవ చేసినట్లైతే వారు సంఘాభివృద్ధిలో చక్కటి నైపుణ్యం కలిగిన వారి దృష్టిలో వైఫల్యం చెందినట్లు కనిపించినప్పటికీ వాస్తవంగా వారు దేవుని దృష్టిలో విజయం సాధించినట్లే.

దేవుడు తన కృప ద్వార అనేకమంది ప్రార్థనలను ఆలకించి సువార్త అంగీకరించని వారి హృదయాలను మార్చుట దేవుని చిత్తమై ఉన్నదని మనము దేవుని సేవకులను

ప్రోత్సహించుట మన కర్తవ్యమైయున్నది. ఈ విధములైన కార్యముల ద్వార మనస్సాక్షి ద్వార మరియు తన సృష్టి ద్వార తీర్పు మరియు సాక్ష్యముల ద్వార దేవుడు అన్యులను ప్రభావితం చేస్తున్నాడు. మరియు ప్రకటించబడిన సువార్త, పరిశుద్ధాత్మ యొక్క ప్రేరణ ఒక వ్యక్తి మారుమనస్సులో ఎంతో సహకరిస్తుంది. కాబట్టి పాస్టరులు ప్రార్థించుతూ, విధేయులగుచు సువార్తను ప్రకటించాలి. ప్రతి ఉజ్జీవానికి ముందు దాని గురించిన గొప్ప అక్కర దాగివుంటుంది. ఉజ్జీవం గురించి కలలు కంటూ కనిపెట్టేవారు ఎప్పుడూ ఉంటారు. కాబట్టి ఉజ్జీవం కొరకు ఎదురుచూస్తువుండు!

## సంఘాభివృద్ధిని నియంత్రించే మూడవ కారణం

సంఘం యొక్క అభివృద్ధిని కుంటుపరచే మూడవ కారణం ఏమిటంటే అది పాస్టరు యొక్క శక్తి, సామర్థ్యాలు. ఒక పెద్ద సంఘాన్ని నడిపించుటకు కావలసిన అర్హతలు అనేకమంది పాస్టరులకు ఉండవు, ఇది వాళ్ళ పొరపాటు ఎంతమాత్రంకాదు. ఒక పెద్ద సంఘానికి అవసరమగు అంశాలు అనగా ఆ సంఘాన్ని నిర్వహించే విషయంలోను, నడిపించే విషయంలోను లేదా బోధనా విషయంలోను వారికి తగినంత తలాంతులు ఉండవు. స్పష్టంగా చెప్పాలంటే అటువంటి పాస్టరులు అంత పెద్ద సంఘాలను నడిపించుటలో దేవుని పిలుపును అందుకొన్నవారు కారు. అలాంటప్పుడు పెద్ద సంఘాలను కావాలని కోరుకొనుట పొరపాటే అవుతుంది.

అమెరికాలోని అతిపెద్ద సంఘాలలోని ఒక సంఘ పాస్టరుగారు నాయకత్వం అనే అంశంపై రచించిన పుస్తకాన్ని ఈ మద్యే నేను చదవటం జరిగింది. ఈ పుస్తకాన్ని చదువుతున్నప్పుడు ఆయన ఒక పాస్టరు ఎలా ఉండాలి అని బోధించుటలేదు గాని, ఒక పెద్ద కంపెనీ యొక్క యజమాని ఎలా ఉండాలో వ్రాస్తున్నాడు. ఆ పాస్టరుకు ఇక వేరే మార్గంలేదు. అతను సంఘానికి ఒక పెద్ద సిబ్బంది అవసరమని, ఆ సిబ్బందిని యజమాయిషి చేయటం అనునది ఒక ఫుల్‌టైమ్ ఉద్యోగం వంటిది అని చెబుతున్నాడు. ఈ పుస్తకాన్ని వ్రాసిన పాస్టరు ఒక వ్యాపార కంపెనీకి అధినేతగా ఉండటానికి కావలసిన అర్హతలు కలిగి ఉన్నాడు. (వాస్తవంగా అతను తన పుస్తకంలో అప్పుడప్పుడు వ్యాపార రంగంలో ప్రఖ్యాతి గాంచిన వారిని ఉదహరిస్తూ వారి సలహాలను పాఠకులకు అన్వ యించుకొమ్మని వ్రాస్తున్నాడు). అయితే ఆయన పాఠకులలో అనేకమందికి ఆయనకున్నట్లుగా వ్యాపార రంగంలో తగిన నైపుణ్యం కాని లేదా నాయకత్వపు లక్షణాలు కాని ఉండవు.

ఆ పాస్టరు తాను అంతపెద్ద సంఘాన్ని ఏవిధంగా కట్టగలిగాడో తన అనుభవాలను వివరిస్తూ అనేక విషయాలు తన పుస్తకంలో వ్రాశాడు. అతడు తన కుటుంబానికి మరియు తన భవిష్యత్ పరిచర్యకు నష్టం వాటిల్లే అనేక తప్పులు పొరపాట్లు చేశాడు. దేవుని కృపవల్ల అతడు దాని నుండి తప్పించుకోగలిగాడు. అతని అనుభవాలు నాకు కొన్ని సంఘటనలను గుర్తుచేశాయి, కొంతమంది సంస్థాపరమైన పాస్టరులు ఇతనిలాగే విజయం పొందాలని

ప్రాకులాడుతూ అదేవిధమైన పొరపాట్లుచేసి ఎన్నో కష్టాలను అనుభవించారు. కొంతమంది తమ సంఘాలకే అంకితమైపోయి తమ పిల్లలను పోగొట్టుకొని తమ సంసారాలనే నాశనం చేసుకున్నారు. కొంతమంది మానసిక వేదనలకు గురైపోవటమో లేదా పరిచర్య నిమిత్తమై తీవ్రమైన మంటతో బాధపడటమో జరిగింది. కొందరికి తమ భ్రమలు తొలగిపోయి తుదకు పరిచర్యనే పరిత్యజించారు. ఇతరులు పరిచర్యలో నిల దొక్కుకోగలిగారు కాని తమ బ్రతుకులను నిరాశలతోనే కొనసాగిస్తూ తమ అనూహ్యమైన త్యాగం తమకు ఏదైన ప్రయోజనం చేకూర్చదా అని తలస్తూవుంటారు.

ఈ పుస్తకాన్ని నేను చదువుతున్నప్పుడు ఆది సంఘం ఎదుర్కొన్న పరిస్థితులు జ్ఞాపకానికొచ్చాయి. ఆధునిక సంస్థాపరమైన సంఘాలతో దానికి పోలికే లేదు మరియు ఆ కాలంలో ఒక పాస్టరు 25 మందికి మాత్రమే కాపరిగా ఉండేవాడు. నేను ఇంతకుముందు అధ్యాయంలో చెప్పిన విధంగా తన సంఘాలు చిన్నగా ఉన్నవి అనుకునే పాస్టరులు లేఖన భాగం యొక్క వెలుగులో తమ ఉద్దేశ్యాలను మార్చుకోవాలి. ఒకవేళ ఆయన సంఘంలో 50 మంది సభ్యులువున్నచో వారి సంఘం వాస్తవంగా పెద్దగా ఉంటుంది. ఒకవేళ దానికి సమర్థవంతమైన నాయకత్వం ఉన్నచో, వారు దేవుని రాజ్యము నిర్మించుటకు మరియు శిష్యులను తయారుచేయవలెననే లక్ష్యంతో ఆ చర్చి భవనమును అమ్మివేసి ప్రార్థనా పూర్వకంగా దానిని మూడు గృహసంఘాలుగా విభజించాలని బావించివుండవచ్చు.

ఇది తీవ్రవాద చర్యగా కనబడుతుంటే, వారు కనీసం కాబోయే నాయకులనైన శిష్యులుగా చేయటం ప్రారంభించాలి లేదా చిన్న సంఘాలను ప్రారంభించవచ్చు లేదా వారికి ఇదివరకే ఇటువంటి చిన్న సంఘాలు ఉన్నచో వాటికి స్వతంత్ర ప్రతిపత్తిగల గృహ సంఘాలుగా ఉండుటకు తగిన స్వేచ్ఛను ఇచ్చి ఏమి జరుగుతుందో గమనించవచ్చు.

## సంఘాభివృద్ధికి కావలసిన మరికొన్ని పద్ధతులు

నేడు అన్వేషకి అనుకూలమైన పద్ధతితోపాటు సంఘాభివృద్ధికి అవసరమైన అనేక పద్ధతులు అవలంబించ బడుతున్నాయి. ఈ పద్ధతులు వాక్యానుసారంగా వుండక "ఆత్మీయ పోరాటము" కిందికి వస్తాయి. అవి ఈ పేరులతో, "అంధకార శక్తులను తొలగించటం," "అంతర్యుద్ధ ప్రార్థన" మరియు "ఆత్మీయ ప్రణాళికలు చేసుకోవటం" ప్రచారం పొందుతున్నాయి.

వీటిని గూర్చిన వివరాలు మనం ఆత్మీయ అంతర్యుద్ధం అనెడి తర్వాత అధ్యాయంలో చూస్తాం. ఒక్కమాటలో చెప్పాలంటే, అపోస్తలులు ఏ మాత్రం ఎరుగని ఈ వింత పద్ధతులు ఈనాడు సంఘాభివృద్ధికి ఎందుకని తప్పనిసరి అని భావించబడుతున్నాయి.

సంఘాభివృద్ధికి ఉపయోగపడు అనేక క్రొత్త పద్ధతులు కొందరు పాస్టరుల యొక్క అనుభవాల ద్వార కలిగిన ఫలితాలు, వారు చెబుతారు, "నేను ఇది చేశాను, అది చేశాను, కాబట్టి నా సంఘం పెరిగింది. నీవు కూడ ఆ పద్ధతులనే అవలంభించినచో నీ సంఘం తప్పక పెరుగుతుంది". ఇందులోని నిజం ఏమిటంటే, వారు ఎంత ఆలోచించినప్పటికీ సంఘాభివృద్ధికి

మరియు వారు అవలంభించే వింత చేష్టలకు ఏమాత్రం సంబంధం లేదు. ఇతర పాస్టరులు అటువంటి విపరీతమైన పద్దతులను అనుసరించి ఆవిధంగానే చేసినను వారి సంఘాలు ఏమాత్రము పెరగలేదు అన్న విషయం చాలా సార్లు రుజువైంది.

ఒక సంఘాభివృద్ధి చెందుతున్న పాస్టరు ఇలా చెప్పటం వింటాడు, ''మా పట్టణమును ఆవరించి ఉన్న దెయ్యాలను మేము గట్టిగా కేకలతో గద్దించినప్పుడు మా సంఘంలో ఉజ్జీవం మొదలైంది. కనుక మీ సంఘంలో ఉజ్జీవం రావలెనంటే మీరు కూడ అదేవిధంగా చేయండి''.

కాని పట్టణాల మీద ఉన్న దయ్యాలను గద్దించకపోయిననూ 2000 సం॥ సంఘ చరిత్రలో ఎన్నో అద్భుతమైన ఉజ్జీవములు ప్రపంచవ్యాప్తంగా ఎందుకని చోటుచేసుకున్నాయి? పాస్టరు ఉజ్జీవము అనునది పొందాలంటే, దయ్యాల పట్ల గట్టిగ అరచి గద్దించాలి అని తలంచుచున్నట్లుగా ఇది చూపిస్తోంది, అతడు అలా తలంచుచున్నట్లయితే అతడు పొరపాటు చేస్తున్నాడు. అతను ఉంటున్న ప్రాంతంలోని ప్రజలు సువార్తను అంగీకరించటం ప్రారంభించారు, బహుశా సంఘమంతా కలసి ఏకీభవించి ప్రార్థన చేయటం వలన పాస్టరు యొక్క సువార్తను వారు అంగీకరించటం జరిగింది. చాలా సందర్భాల్లో సంఘాభివృద్ధి అనునది పరిచర్యను సరైన స్థలంలో సరైన సమయంలో ప్రారంభించటం వలన సాధ్యమవుతుంది. (పరిశుద్ధాత్ముడు మనలను సరైన స్థలంలో సరైన సమ యంలో పరిచర్యను ప్రారంభించేల నడిపిస్తాడు).

ఒకవేళ దయ్యాల మీద గట్టిగా అరచి గద్దించిన కారణంగా సంఘంలోనికి ఉజ్జీవం రావటం జరుగుతోంది అని భావిస్తే, మరి ఎందుకని ఆ ఉజ్జీవం ఎప్పటిలాగే చాలా కాలానికి నిదానంగా సంఘంలోనికి వస్తోంది? ఒకవేళ దయ్యాలపట్ల అరవటం అనేదే ఉజ్జీవానికి కీలక మైవున్నట్లయితే, మనం కేవలం వాటి పట్ల అరుస్తూ గద్దిస్తూ వుంటేచాలు, ప్రతిఒక్కరూ క్రీస్తు దగ్గరికి వస్తారు. కాని అలా జరగటం లేదే!

మనం కొంచెం ఆలోచిస్తేచాలు సత్యం తెలిసిపోతుంది. బైబిలు ప్రకారమైన పద్దతులు అనగా ప్రార్థన, బోధన, ఉపదేశం, శిష్యులను తయారుచేయటం, పరిశుద్ధాత్మని నడుపుదల ఇలా ఈ విధమైన సాదనముల ద్వారానే సంఘాభివృద్ధి సాధ్యపడుతుంది. కాని ఈ బైబిలు ఆధారిత పద్ధతుల ద్వార సంఘాభివృద్ధి జరుగుతుందని ఖచ్చితంగా చెప్పలేం, ఎందుకంటే దేవుడు మానవులకు తమ చిత్తప్రకారం నడుచుకొనేలా ఆ స్వాతంత్రం ఇచ్చాడు. వారు మారుమనస్సు పొందాలా, ఒద్దా అన్నది వారు నిర్ణయించుకోవచ్చు. యేసు కొన్ని పట్టణాలను సందర్శించినప్పుడు అందులోని ప్రజలు మారుమనస్సు పొందకపోవటం చేత చివరకు ఆయన కూడ సంఘాభివృద్ధి చేయుటలో అపజయాన్ని ఎదుర్కొన్నారని చెప్పబడుతోంది.

దీనిని బట్టి మనం తెలుసుకోవలసిన సత్యం ఏమిటంటే, కేవలం బైబిలు ఆధారిత పద్ధతుల ద్వార మాత్రమే సంఘం అభివృద్ధి చెందుతుంది. తక్కిన ఏ పద్దతులు పాటించిన మన సమయం వృదా అవుతుందే తప్ప ఫలితం దక్కదు. ఇవి కఱ్ఱి, గడ్డి, కొయ్యలతో చేయబడిన పనులవంటివి, అవి ఒకనాడు అగ్నిచేత పరీక్షించబడును (1కొరింథీ 3:12-15 చూడుము).

చివరిగా చెప్పేదేమిటంటే, నీ లక్ష్యం సంఘ సభ్యుల సంఖ్య పెరుగుదల మీద వుంచక, శిష్యులను తయారుచేయుటయందు వుంచుము. మనం శిష్యులను తయారుచేస్తువుండగా సంఘం వృద్ధిచెందుచున్నట్లయితే అందులకు దేవునికి స్తోత్రం చెల్లించాలి!

